క్లుప్తంగా

మూడు రోజులకే హౌసింగ్ బిల్లులు



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ, ఎంపీడీఓ

డోన్ రూరల్: జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తయిన మూడు రోజులకే బిల్లులు లబ్ధిదారుల ఖాతాలో జమవుతున్నాయని హౌసింగ్ డీఈ నాగభూషణంరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కోరారు. నిర్మాణం చేపట్టని వారి నుంచి ఇంటి పట్టా వెనక్కు తీసుకుంటామని స్పష్టం చేశారు. బిలుల విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

కొలిమిగుండ్ల: త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాన్ని గురువారం నాయీబ్రాహ్మణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కాలనీలో త్యాగరాజ స్వామి చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నేత పేరం నందకిషోర్‌రెడ్డితో పాటు పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి చిత్ర పటాన్ని ప్రత్యేక పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరిపించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోవెలకుంట్ల: సంజామల మండలం కమలపురి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి గురువారం రూ. 25వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి సేవాసంస్థ సభ్యులు రవిరెడ్డి, సరోజ, సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు రాముడు, బాలపుల్లయ్య, పెద్ద ఓబులేసు, ఖాసీం, ఓబులేసు పాల్గొన్నారు.

14న గోదాదేవి, శ్రీకృష్ణుడి కల్యాణోత్సవం

డోన్: ఈనెల 14వ తేదీన స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే గోదాదేవి, శ్రీకృష్ణుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు, రజనీకుమారి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వైభవంగా నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడమే కాక బెంగళూరు నుంచి వివిధ రకాల పుష్పాలను అలంకరణ నిమిత్తం తెప్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో వేడుక జరుగనుంది.

అన్నదానం

డోన్: స్థానిక కోర్టు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కమలాపురం గ్రామ సర్పంచ్ రేగటి అర్జునరెడ్డి గురువారం పేదలకు అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దశరథరామిరెడ్డి, మల్లారెడ్డి, సభ్యులు రాజయ్యగౌడ్, జింకల కృష్ణ, రాజా విజయ్‌కుమార్, శంకర్‌గౌడ్, సత్యసేనారెడ్డి పాల్గొన్నారు.

రైతులు కలిసికట్టుగా ఉండాలి

బనగానపల్లెరూరల్: రైతులు తమ హక్కుల సాధనకు కలిసికట్టుగా ఉండాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోరారు. గురువారం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో రైతు సంఘం కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాజశేఖర్ మాట్లాడుతూ రైతులందరూ కలిసి ఉంటే రైతు వ్యతిరేక నిర్ణయాలపై పోరాడి తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలను రైతులు చేసిన ఉద్యమ ఫలితంగానే వెనక్కి తీసుకుందన్నారు. మండల కన్వీనర్‌గా జిల్లెల్ల సుబ్బారెడ్డి, కో కన్వీనర్లుగా మహేశ్వరరెడ్డి, జీవీ సుబ్బయ్య సభ్యులుగా పలువురిని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు,సుబ్బరాయుడు పాల్గొన్నారు.


నివాళి

కొలిమిగుండ్ల: మండలంలోని కనకాద్రిపల్లెకు చెందిన పారిశ్రామిక వేత్త పుచ్చా వెంకట మల్లారెడ్డి తల్లి నాగమ్మ (80) వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పీఆర్ రామిరెడ్డి,అనంతపురం జిల్లా కార్యదర్శి పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డితో పాటు పారిశ్రామిక వేత్తలు పీఆర్ లక్ష్మిరెడ్డి,తిరుపాలు యాదవ్ తదితరులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బనగానపల్లెరూరల్: స్థానిక ఎంపీజే కార్యాలయంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) 2023 నూతన క్యాలెండర్లను జమాతే ఇస్లామి హింద్ సెక్రటరీ గౌస్‌బాషా ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు మునీర్‌బాషా, సభ్యులు ఇర్ఫాన్, అహమ్మద్, మాబాషా, షఫీ,శేఖర్, రఫీక్ పాల్గొన్నారు.

వివేకానందుడి అడుగు జాడల్లో నడవాలి



బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ వసుంధర



మాట్లాడుతున్న జడ్జి తంగమణి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్



కోవెలకుంట్ల పంచాయతీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కోవెలకుంట్ల: యువత స్వామి వివేకానందుడి అడుగు జాడల్లో నడవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గురువారం స్వామి వివేకానంద 160వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, వరంధామ నిలయంలో ప్రకృతి సేవా పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి, సంజామల మండలం గిద్దలూరులో లైబ్రేరియన్ మద్దిలేటి ఆధ్వర్యంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, వాల్మీకి సంఘ కార్యాలయంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎంవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణదాసు, ఉశేన్‌బాషా, రాజు, సందీప్, నారాయణస్వామి, నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

డోన్ : యువతకు స్ఫూర్తిదాయకం స్వామి వివేకానందుడేనని కౌన్సిలర్ దినేష్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో గురువారం ఆయన వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ ధారా హరినాథ్‌రెడ్డి, నాయకులు మహేంద్ర పాల్గొన్నారు.

బేతంచెర్ల : ప్రపంచ దేశాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పి మహోన్నత వ్యక్తిగా స్వామి వివేకానందుడు నిలిచాడని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సముద్రాల మద్దిలేటిస్వామి, అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్‌రెడ్డి, సునీల్ కుమార్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. సభ్యులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బనగానపల్లెరూరల్: నేటి యువత స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వసుంధర కోరారు. గురువారం స్థానిక కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ బడేసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు ఉమామహేశ్వరరెడ్డి, ఏ.మహేశ్వరరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని బలమైన దేశాన్ని నిర్మించాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని డోన్ తాలూకావినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, నాయకులు దస్తగిరి,చిన్నమల్కాపురం ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ విజయ్‌భాస్కర్ ఉన్నారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో భగవద్గీత పఠనం చేసిన విద్యార్థులను సత్కరించారు.సంస్థ వ్యవస్థాపకుడు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్ష,కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

కోవెలకుంట్ల: విద్యార్థులు ఇష్టమైన రంగాల్లో రాణించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా అన్నారు. గురువారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో 9,10. ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అన్నారు. పదో తరగతి అనంతరం తమకు అనువైన కోర్సులను ఎంపిక చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ప్రసాద్, సంస్థ సిబ్బంది ఉశేని, మహేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

14న ముగ్గుల పోటీలు

బనగానపల్లె: కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు గురువారం తెలిపారు.కొత్తబస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగే పోటీల్లో విజేతలకు బహుమతులు వరుసగా డబుల్‌డోర్ రిఫ్రిజిరేటర్, సింగిల్‌డోర్ రిఫ్రిజిరేటర్, ఎల్ఈడీ టీవీ, వాషింగ్‌మిషన్, రైస్ కుక్కర్లు అందజేస్తామని, అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు నూకల వాసంతి 944064 3555, బండారు లలిత 9441776499, ఎస్ విశాలక్ష్మి 94406 34477,జి.సుప్రజ 9492404448 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నారాయణ స్కూల్‌లో షార్ట్ సర్క్యూట్

డోన్ రూరల్ : పట్టణంలోని నారాయణ ప్రైవేటు పాఠశాలలో గురువారం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఫైర్ అధికారి రంగస్వామి గౌడ్ వివరాల మేరకు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో జనరేటర్ పూర్తిగా కాలిపోయిందన్నారు. మంటల విషయంపై తమకు సమాచారం రావడంతో వచ్చి అదుపు చేశామని చెప్పారు.

డోన్ టౌన్: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అశోక్,తెలుగు విజయ్‌కుమార్ కోరారు. గురువారం స్కూల్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సంక్రాంతి సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించారని ఆరోపించారు.నాయకులు సునీల్,మాబు,సురేష్‌లు ఉన్నారు. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయు జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మారం రంగనాయకులు డీఈఓ అనురాధకు వినతి పత్రం అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సీజ్ చేసిన బియ్యం, లారీని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 302 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని రెండు వాహనాలను సీజ్ చేశారు. వివరాలు.. బియ్యం తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు గురువారం ఉదయం 6.30 గంటలకు గుత్తి మండలం బసినేపల్లి శివారులో విజిలెన్స్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ లారీతో పాటు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు శ్రీనివాసులు, నరసింహులు, వ్యాపారులు నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన వడ్డే నాగరాజు, రామచంద్రపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ కంబక్క తెలిపారు.

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్యాపిలి: స్థానిక ఒకటో రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేశామని వ్యవసాయాధికారి షేక్షావలి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశం సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

నిర్మాణాలు చేపట్టకపోతే ఇళ్లు రద్దు



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసయాదవ్

కోవెలకుంట్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే రద్దవుతాయని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస యాదవ్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామ సచివాలయ గ్రామ వలంటీర్లు, లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు, పక్కాగృహాలు పంపిణీ చేసిందన్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి లేఅవుట్లు వేసి ఇళ్లపట్టాలు అందజేసిందని చెప్పారు.వారం రోజుల్లో నిర్మాణాలు చేపట్టకపోతే రద్దవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పల్లెల్లో గొడవలు సృష్టించొద్దు

డోన్ రూరల్: తమకు అనుకూలమైన పేపర్లలో తప్పుడు రాతలు రాయించి గ్రామాల్లో గొడవలు సృష్టించాలని టీడీపీ నాయకులు కుట్రలు పన్నడం సరికాదని, ప్రశాంతమైన గ్రామాల్లో ఘర్షణలు చెలరేగేలా వ్యవహరించొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. రెండు రోజుల క్రితం గుమ్మకొండ గ్రామానికి చెందిన ఉప్పరి రేణుక పొలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బలవంతంగా లాక్కున్నారని ఆంధ్రజ్యోతి పేపర్‌లో అసత్య ప్రచారం చేశారని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి, హనుమన్న, మల్యాల భాస్కర్‌రెడ్డి, కమలాపురం బొబ్బల శివరాంరెడ్డి, వెంకటాపురం గట్టు సుంకన్న, కొత్తకోట శ్రీను మండిపడ్డారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పొలం విషయంలో టీడీపీ నాయకులే దగ్గర ఉండి పెద్దల సమక్షంలో పంచాయితీ చేశారన్నారు. ఇందులో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు హరిశంకర్‌గౌడ్, సుగాలి నాయుడు, తలారి రాముడు, తలారి రామాంజనేయులు, అనుమప్ప, కిందింటి లింగడు, టి.శేఖర్, అలాగే పంచాయితీ రాజ్ ఏఈ నారాయణ పాల్గొన్నారని చెప్పారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం 2003 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని సంతోషంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంలో మునిగిపోయారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బాలసుబ్బారెడ్డి, దానమయ్య, సెల్వరాజ్, సునీల్‌రాజ్, చంద్రశేఖర్,సుజాత,రవిప్రకాష్‌రెడ్డి,శ్రీనివాసులుతో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమణ, జనార్దన్, నారాయణస్వామి, చంద్రారెడ్డి, రవి, శివ నాగేష్, సులోచన,పాతిమా,రసూల్‌బీ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

బేతంచెర్ల: బెంగళూరులో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే అఖిల భారత సీఐటీయూ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య కోరారు. గురువారం యూనియన్ కార్యాలయంలో గౌరవ అధ్యక్షుడు సాదిక్ హుసేన్ జెండా ఆవిష్కరించారు.

ప్యాపిలి: బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే సీఐటీయూ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహెమాన్ కోరారు. మండలంలోని జలదుర్గం గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఐటీయూ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాగభూషణం, షేక్ హుసేన్, శ్రీనివాసులు, ఖాజావలి, మద్దయ్య పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి వృద్ధుడి తరలింపు

డోన్ టౌన్: కుటుంబ సభ్యుల ఆదరణ కరువై అన్నం లేక అలమటిస్తున్న 73 ఏళ్ల వృద్ధుడిని పూల లలిత ఆదరించి హోసన్నా వృద్ధాశ్రమంలో గురువారం చేర్పించింది. దేవనకొండ మండలం మాచాపురం గ్రామానికి చెందిన నడిపి రాముడుకుభార్య,ఇద్దరు కుమారులు,కూతుళ్ళు ఉన్నప్పటికీ ఆదరణ లేక డోన్ పాతబస్టాండ్‌లో కొద్ది రోజులుగా ఆకలితో అలమటిస్తుండటాన్ని చూసి పూల వ్యాపారి లలిత వివరాలు తెలుసుకొని ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్‌తో సంప్రదించి ఆశ్రమంలో చేర్పించింది.

రైతులకు న్యాయం చేయాలి

డోన్ టౌన్: రైల్వే డబుల్ లైన్ విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దిలేటి కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీఓ వెంకటరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు నాలుగు రెట్ల అధికంగా పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయంగా కొంత భూమి ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని నిబంధనలు పేర్కొంటున్నా రైల్వే శాఖ వారు నామమాత్రంగా ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. చిన్నమల్కాపురం గ్రామ ఉప సర్పంచ్ రాజేశ్వరరెడ్డి, ఉన్నిగొర్ల జనార్దన్, సుబ్బుయాదవ్ ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన రామాంజనేయులు

డోన్ రూరల్ : పట్టణ సమీపంలోని స్థానిక యు.కొత్తపల్లి గ్రామం వద్ద గురువారం లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాని పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు..తుగ్గలి మండలంలోని గుడిమెళ్ల కొత్తపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు గొర్రెల మందుల కోసం డోన్‌కు బైక్‌పై వస్తుండగా కొత్తపల్లి వద్ద ఉన్న బ్రిడ్జి కింద నుంచి వస్తుండగా కర్నూలు వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడటంతో చికిత్స కోసం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు రెఫర్ చేశారని పట్టణ పోలీసులు వివరించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

డోన్ రూరల్ : పట్టణంలోని చాకిరేవు మిట్ట వద్ద మంగళవారం జరిగిన బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కల్యాణ్ గురువారం కోలుకోలేక కర్నూలులో మృతి చెందాడు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కల్యాణ్ తీవ్రంగా గాయపడటంతో కర్నూలు వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న దృశ్యం

డోన్ రూరల్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటనాయునిపల్లి గ్రామంలో గురువారం ఎంపీపీ ఆధ్వర్యంలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత ఉండి పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు, జెడ్పీటీసీ రాజేకుమార్‌యాదవ్, సర్పంచ్ శీలం చంద్రశేఖర్, ఎంపీటీసీ జానకిరాం, మంత్రి పీఏ.మహేశ్వరరెడ్డి, నాయకులు రాంకుమార్, రాజు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ వరప్రసాద్‌రావు,ఏఈలు అబ్దుల్‌షఫీ,సతీష్, మహేష్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన పోటీలకు ఆయా కాలనీల నుంచి పెద్ద ఎత్తున్న మహిళలు పాల్గొన్నారు. 140 మంది మహిళలు, యువతులు రంగవల్లులను తీర్చిదిద్దారు. న్యాయ నిర్ణేతలుగా విజయలక్ష్మి, రేణుక వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి సహకారంతో ప్రథమ బహుమతి సాధించిన మల్లికకు ఫ్రిజ్, శ్రీ కృష్ణ ఎంటర్ ప్రైజెస్ సహకారంతో ద్వితీయ బహుమతి సాధించిన విజయలక్ష్మికి దివాన్ కాట్, లక్ష్మీ నరసింహస్వామి రైస్ మిల్ సహకారంతో తృతీయ స్థానంలో నిలిచిన రామేశ్వరమ్మకు డైనింగ్ టేబుల్, మిగిలిన స్థానాల్లో నిలిచిన వారికి దాతల సహకారంతో బహుమతులు అందజేశారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సముద్రాల మద్దిలేటిస్వామి, అధ్యక్ష కార్యదర్శులు జశ్వంత్ రెడ్డి, సునీల్ కుమార్, సభ్యులు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బళ్లారి సూర్య పాల్గొన్నారు.

డోన్ టౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ప్రజా నాట్యమండలి, మీఎస్ఎం, సీపీఎం, సీఐటీయూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామనగర్‌లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

అక్రమ వసూళ్లను అరికట్టండి



డీఈఓ అనురాధకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల యజమానులు వివిధ కార్యక్రమాల నిమిత్తం విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వాటిని అరికట్టి, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ధర్మారం రంగనాయకులు, మరియు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓ అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ఓ జూనియర్ కళాశాల, స్కూల్ బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమం కోసం ఇంటర్ విద్యార్థుల నుంచి రూ.600, పదో తరగతి విద్యార్థుల నుంచి రూ.500 ప్రకారం వసూలు చేశారని ఆరోపించారు. విచారణ చేసి వసూలు చేసిన మొత్తాన్ని విద్యార్థులకు తిరిగి చెల్లించి, వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తుఫాన్..లారీ ఢీ

- ఆరుగురు అయ్యప్ప మాలధారులకు గాయాలు
- మహబూబ్ నగర్ నుంచి శబరిమల వెళ్తుండగా ఓబులాపురం వద్ద ప్రమాదం
- క్షతగాత్రులు కర్నూలుకు తరలింపు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

డోన్ రూరల్ : మండలంలోని ఓబులాపురం మిట్ట వద్ద గురువారం సాయంత్రం తుఫాన్ వాహనం లారీని ఢీ కొన్న ఘటనలో ఆరుగురు అయ్యప్ప మాలధారులకు గాయాలయ్యాయని రూరల్ పోలీసులు తెలిపారు. వివరాలు..మహబూబ్ నగర్ నుంచి శబరిమలకు తుఫాన్ వాహనంలో వెళ్తుండగా మండలంలోని ఓబులాపురం మిట్ట వద్ద ముందువెళ్తున్న లారీని అయ్యప్ప మాల ధారులు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే కర్నూలుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని రూరల్ పోలీసులు పేర్కొన్నారు.



పంటకు చీర రక్ష..

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల సమీపంలో శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఓ రైతు జొన్న పంట చుట్టూ రక్షణగా చీరలు కట్టారు. ప్రస్తుతం పంట గింజ దశలో ఉంది. అడవి జంతువులు పంటను నాశనం చేయకుండా చీరలు కట్టామని రైతులు పేర్కొన్నాడు. రాత్రి పూట అడవి జంతువులకు ఏదైనా అడ్డుగా ఉంటే అటు వైపు రావని దీంతో పంటను కాపాడుకోవడానికి ఇలా చుట్టూ చీరలు కట్టామని వివరించాడు.